నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, మంగళవారం 4 మార్చి 2025 | RANGAREDDY

కార్తీక్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న పలువురు యువకులు, నాయకులు

రాజేంద్రనగర్‌లో ఉప ఎన్నిక ఖాయం

బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి కార్తీక్ రెడ్డి

బండ్లగూడ, మార్చి 3 : రాజేంద్రనగర్‌లో ఉప ఎన్నిక రావడం ఖాయమని.. బీఆర్ఎస్ పార్టీ భారీ మెజార్టీతో గెలుపొందడం తథ్యమని బీఆర్ ఆ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి పేర్కొన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన సుధాకర్‌గౌడ్‌తో పాటు పలువురు యువకులు, నాయకులు పెద్ద ఎత్తున కార్తీక్‌రెడ్డి సమక్షంలో సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పక్కదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేక సీఎం, మంత్రులు బీఆర్ఎస్ పార్టీపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని ప్రజలు, నాయకులు, యువకులు పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరేందుకు ఉత్సాహంగా ఉన్నారన్నారు. అనంతరం బండ్లగూడజాగీర్ పార్టీ అధ్యక్షుడు రావుల కోళ్ల నాగరాజు మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రవీందర్ రెడ్డి, శాంతీనాయక్, రాముడు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క నెలలోనే 153 వాహనాలు సీజ్

రూ. 46,62,000 వసూలు

- జిల్లా రవాణా శాఖ అధికారి వెంకట్‌రెడ్డి

వికారాబాద్, మార్చి 3 : ఒక్క నెలలోనే సీజ్ చేసిన 153 వాహనాల నుంచి రూ. 46,62,000 వసూలు చేసినట్లు వికారాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారి వెంకట్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి నెలకుగానూ ట్యాక్స్ చెల్లించని 153 వాహనాలను సీజ్ చేస్తే జరిమానా రూపంలో ఆ మొత్తం సమకూరిందన్నారు. ఇంకా ట్యాక్స్ చెల్లించని వాహనదారులు ఆన్‌లైన్‌లో లేదా మీ సేవ కేంద్రాల్లో చెల్లించాలని సూచించారు. అలాగే, ప్రతి వాహనదారుడూ తమ వాహనాన్ని వారి మొబైల్ నంబర్‌కు లింక్ చేసుకోవాలని.. తద్వారా వెహికిల్‌కు సంబంధించిన సమాచారం, ఫిట్‌నెస్, రెన్యువల్, ట్యాక్స్ పేమెంట్స్ తదితర సమాచారం మొబైల్ ఫోన్ ద్వారా తెలుసుకోవచ్చునన్నారు.

అన్నదాత అరిగోస

చాలీచాలని నీటితో రాలిపోతున్న మామిడి పూత..

- అడుగంటుతున్న భూగర్భ జలాలు..
- కరెంటు కోతలతో సమస్య మరింత తీవ్రం
- దిగుబడిపై ఆశలొదులుకుంటున్న రైతులు

రంగారెడ్డి, మార్చి 3 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని మామిడి రైతుల ఆశలు ఆవిరైపోతున్నాయి. గత రెండు సీజన్లల్లోనూ ఆశించిన మేర మామిడి దిగుబడి రాక.. తీవ్ర నష్టాల్లో ఉన్న మామిడి రైతులకు ఈసారి కూడా పెద్దగా ఫలితాలు దక్కే అవకాశాలు లేకుండా పోతున్నాయి. ఓవైపు మండుతున్న ఎండలు.. మరోవైపు కరెంట్ కోతలతో సరిపడా నీటి లభ్యత లేక మామిడి పూత పెద్ద ఎత్తున రాలిపోతున్నది. దానికితోడు అనేక రకాల చీడపీడలు సోకుతున్నాయి. మామిడి పూత రాలే విషయంలో రైతులకు ముందు జాగ్రత్తగా సూచనలు ఇవ్వడంలో ఉద్యానవన శాఖ అధికారులు ముందుకు రావడం లేదన్న ఆరోపణలున్నాయి.

మామిడి తోటలను సాగు చేసిన రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఓవైపు మండుతున్న ఎండలు.. మరోవైపు కరెంట్ కోతలతో సరిపడా నీటి లభ్యత లేక మామిడి పూత పెద్ద ఎత్తున రాలిపోతున్నది. అంతంత మాత్రంగానే ఉన్న పూత పిందెలు పట్టకముందే రాలుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది కూడా మామిడి దిగుబడిపై ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని కన్నీరుమున్నీరవుతున్నారు. కాగా, జిల్లాలో 26,000 మామిడి తోటలున్నాయి.

తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నాం..

మామిడి తోటలతో ప్రతి ఏటా నష్టాలే వస్తున్నాయి. ఇబ్రహీంపట్నం మండలంలోని దండుమైలారం గ్రామంలో సుమారు 700 ఎకరాల్లో రైతులు మామిడి తోటలను సాగు చేశారు. అయితే, ఆ తోటలు పూత పూసి కాత దశకు వచ్చే సమయంలో ఎండలు తీవ్రరూపం దాల్చి భూగర్భజలాలు అడుగంటుతుండడంతో బోరుబావులు ఎండిపోయి నీరు సక్రమంగా అందడం లేదు. దీంతో పూత రాలిపోయి తీవ్ర నష్టాలు వస్తున్నాయి. ఈ ఏడాది ఇంకా దారుణంగా తయారైంది. మామిడితోటను కాపాడుకునేందుకు మూడు బోర్లు వేసినా అవి రెండు రోజులు పోసి ఎండిపోయాయి. దీంతో తీవ్ర ఇబ్బందిగా మారింది.

-బిట్ల వెంకట్‌రెడ్డి, దండుమైలారం

జిల్లాలో 26 వేల ఎకరాల్లో ..

జిల్లాలో 26 వేల ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. జిల్లాలోని 21 మండలాల్లో ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, తలకొండపల్లి, మాడ్గుల, అబ్దుల్లాపూర్‌మెట్, షాద్‌నగర్, కొందుర్గు, కేశంపేట, కడ్తాల్ మండలాల్లో ఈ తోటలు అధికంగా ఉన్నాయి. మామిడి పూత సమయంలో చెట్ల వద్ద పాదులు చేసి, ఎరువులు వేసి నీటిని అందిస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో భూగర్భజలాలు అడుగంటి బోరు బావుల్లోనూ నీటిమట్టం గణనీయంగా తగ్గిపోయింది. దీంతో గతంలో రోజంతా పోసే బోర్లు కూడా ఒకటి లేదా రెండు గంటలు మాత్రమే పోస్తున్నాయి. దీంతో మామిడి తోటలకు సరిపడా నీరు అందక పూత రాలేందుకు ప్రధాన కారణమవుతున్నది. దీంతో అంతంత మాత్రంగానే ఉన్న పూత పిందెలు పట్టకముందే రాలుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది కూడా మామిడి దిగుబడిపై ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.

నీరు అందక రాలుతున్న పూత

ఎండలు పెరుగుతుండడం.. సరిపడా నీరు అందకుంటే పూత రాలేందుకు ఆస్కారం ఉంటుంది. అందుకోసం తప్పనిసరిగ్గా నీరు అందించాలి. అప్పుడే పూత రాలకుండా ఉండడమే కాకుండా కాత కూడా కాస్తుంది.

-సురేశ్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి

ఈసారీ నష్టాలు తప్పేలాలేవు

నాకు పదెకరాల మామిడి తోట ఉన్నది. ఏటా పాదులు తవ్వించడం, మందులను పిచికారీ చేసేందుకు అధికంగా ఖర్చు అవుతున్నది. గత మూడు సీజన్లలోనూ పూత రాలి.. కాత రాక తీవ్రంగా నష్టపోయా. పెట్టుబడులూ రాలేదు. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి నెలకొన్నది. ఎండలు పెరుగుతుండడంతో బోర్ల నుంచి నీరు సరిగ్గా రాకపోవడంతో తోటలకు అందించలేకపోతున్నా. దీంతో పూత రాలి పిందెలు పట్టడం లేదు. దీంతో ఈ సారీ నష్టాలు తప్పేలా లేవు.

-వల్లూరి ముత్యమయ్య, రైతు

వాడుకకూ నీళ్లు లేవ్..

- అయినాపూర్‌లో వారం రోజులుగా తాగునీటి కష్టాలు
- సమస్య పరిష్కరించాలని పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో మహిళల నిరసన

దోమ, మార్చి 3 : వారం రోజులుగా తాగునీరు రావడం లేదని సమస్యను పరిష్కరించాలని మహిళలు సోమవారం ఖాళీ బిందెలతో అయినాపూర్ గ్రామ పంచాయతీ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ.. గ్రామంలోని నాలుగు వార్డుల్లో గత వారం రోజులుగా తాగునీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని.. వాడుకునేందుకు నీళ్లు రావడం లేదని ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి, వాటర్‌మన్‌లకు పలుసార్లు చెప్పినా ఫలితం లేకపోవడంతో సోమవారం ఖాళీ బిందెలతో పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపామన్నారు. ఈ విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి నరేందర్‌గౌడ్ అక్కడికి చేరుకొని మహిళలకు సర్ది చెప్పడంతో వారు ఆందోళన విరమించారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా.. బోరు బావిలో నీరు తగ్గిందని.. మిషన్ భగీరథ తాగునీరు కూడా సరిపడా రావడం లేదన్నారు. బోరు బావిలో మరో నాలుగు పైపులను దింపి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్న రెవెన్యూ అధికారులు

కబ్జాదారులకు కాంగ్రెస్ అండ..!

రియల్టర్లతో కలిసి వికారాబాద్ జిల్లాలోని అసైన్డ్ భూముల కబ్జా

- యాలాల మండలంలోని కోకట్‌లో రూ.కోటి విలువ గల ఎకరం అసైన్డ్ భూమిని ఆక్రమించిన రియల్టర్
- కబ్జా ప్రాంతాన్ని పరిశీలించినా చర్యలు తీసుకోని రెవెన్యూ అధికారులు
- అలాగే కొత్రేపల్లిలోని సర్వేనంబర్ 164 అసైన్డ్ భూమిలో నుంచి అక్రమంగా రోడ్డు నిర్మాణం

వికారాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కబ్జాలు, దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా పలు మండలాల్లోని కాంగ్రెస్ నాయకులు బరితెగిస్తున్నారు. వారి అండతో రియల్టర్లు జిల్లాలోని చాలా ప్రాంతాల్లో పేదలు సాగు చేసుకుని బతికేందుకు ఇచ్చిన ప్రభుత్వ, అసైన్డ్ భూములను ఆక్రమించుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. బీఆర్ఎస్ హయాంలో పదేండ్లపాటు ప్రభుత్వ, అసైన్డ్ భూములను కాపాడితే.. రేవంత్ సర్కార్ వచ్చిన నాటి నుంచే కబ్జాల పర్వం ప్రారంభమైంది. కాంగ్రెస్ నాయకులు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై భూదందాకు పాల్పడుతున్నారనే ప్రచారమూ జోరుగా సాగుతున్నది. అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాజాగా జిల్లాలోని యాలాల మండలంలోని కోకట్‌తోపాటు వికారాబాద్ జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న కొత్రేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో అసైన్డ్ భూమిని దర్జాగా కబ్జా చేసి ప్రైవేట్ వెంచర్‌కు రోడ్డును నిర్మించాలని పలువురు పేర్కొంటున్నారు.

కోకట్‌లో రూ.కోటి విలువైన అసైన్డ్ భూమి కబ్జా...

యాలాల మండలంలోని కోకట్‌లో అసైన్డ్ భూమిని కబ్జా చేసి ప్రహరీ ఏర్పాటు చేసిన ఓ రియల్టర్

కాంగ్రెస్ నాయకుల అండతో జిల్లాలో రియల్టర్లు దర్జాగా అసైన్డ్ భూములను కబలించి.. వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారని.. వారికి అధికారులూ వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలున్నాయి. యాలాల మండలంలోని కోకట్ పంచాయతీ పరిధిలోని సర్వేనంబర్ 64లోని రూ. కోటి విలువైన ఎకరం అసైన్డ్ భూమిని ఓ రియల్టర్ కబ్జా చేసి ప్రహరీ ఏర్పాటు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని వారికి ముడుపులు అందడంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. అయితే ఆ రియల్టర్‌కు స్థానిక కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల అండ పుష్కలంగా ఉన్నదనే ప్రచారమూ జరుగుతున్నది. ఇటీవల తాండూరు సెగ్మెంట్‌కు చెందిన ప్రజాప్రతినిధులతో డీల్ కుదిరిన తర్వాతే వారి అండతోనే ఈ కబ్జాకు పాల్పడినట్లు సమాచారం. అసైన్డ్ భూమి కబ్జా వ్యవహారాన్ని ఓ రెవెన్యూ అధికారే నడిపించినట్లు.. ఆ భూమిని పట్టా భూమిగా మార్చేందుకు రికార్డులనూ తారుమారు చేసేందుకు ఒప్పందం కుదిరినట్లు ప్రచారం జరుగుతున్నది.

అసైన్డ్ భూమిలో వెంచర్‌కు రోడ్డు..

రీజినల్ రింగ్ రోడ్డు, అనంతగిరి టూరిజం పేరిట వెంచర్లు ఏర్పాటు చేస్తున్న రియల్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ మధ్యే పూడూరు మండలంలోని ఎన్కెపల్లి పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేస్తున్న ఓ ప్రైవేట్ వెంచర్ నిర్వాహకులు రైతులు విక్రయించకుండానే స్థానిక రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై వారి పేరిట రైతుల భూమిని మార్చుకున్న ఘటన మరువక ముందే ఆ వెంచర్‌కు సమీపంలో వెలసిన మరో వెంచర్ నిర్వాహకులు ఏకంగా అసైన్డ్ భూమినే కబ్జా చేసి రోడ్డును నిర్మిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

వికారాబాద్ మండలంలోని కొత్రేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వేనంబర్ 164లో ప్రభుత్వం అప్పట్లో పలువురు రైతులకు అసైన్డ్ పట్టాలను అందజేసింది. ఆ సర్వేనంబర్‌లో మిగిలి ఉన్న మిగతా అసైన్డ్ భూమికి ఆనుకొని మద్దులగడ్డతండాకు వెళ్లే రోడ్డు వరకు 15 ఫీట్ల నక్క రోడ్డు కూడా ఉన్నది. ఆ రోడ్డు దాటిన తర్వాత మొత్తం ప్రభుత్వ భూమే ఉన్నది. దానిని అదునుగా భావించిన కొందరు రియల్టర్లు 15 ఫీట్ల రోడ్డులోనే ఓ వెంచర్‌ను ఏర్పాటు చేసి..దాని పక్కనే ఉన్న అసైన్డ్ భూమిని కబ్జా చేసి 40 ఫీట్ల రోడ్డుగా రాత్రికి రాత్రే ఏర్పాటు చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే, ఆ రోడ్డు నిర్మాణానికి భూములిస్తే డబ్బు ఇస్తామని అసైన్డ్‌దారులకు ఆశ చూపారని.. రోడ్డు నిర్మాణం పూర్తి కాగానే ఆ రియల్టర్లు రైతులను పట్టించుకోకపోవడంతో ఈ కబ్జా విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందన్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని.. వారికి భారీగా డబ్బులు అందినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతున్నది. ఈ కబ్జా వ్యవహారాన్ని కాంగ్రెస్‌కు చెందిన ఓ నాయకుడు వెనుక ఉండి నడిపించారనే ప్రచారం జరుగుతున్నది.

కొత్రేపల్లిలో అసైన్డ్ భూమిని కబ్జా చేసి ఏర్పాటు చేసిన రోడ్డు

వెల్‌నెస్ సెంటర్లకు సుస్తీ !

ఓపీ కోసం గంటల తరబడి ఎదురుచూపులు

మందులు కావాలంటే బయటికి వెళ్లాల్సిందే

సిటీబ్యూరో, మార్చి 3 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులకు ఆరోగ్య సేవలందించే ప్రభుత్వ వెల్‌నెస్ సెంటర్లు సమస్యలతో స్వాగతం పలుకుతున్నాయి. వైద్యం కోసం వచ్చే వారికి నీరసం తప్ప సకాలంలో వైద్యం అందడం లేదు. వెల్‌నెస్ కేంద్రాల్లో నాడీ పట్టే వైద్యులు సరిపడా లేకపోవడంతో ఇబ్బందుల పాలవుతున్నారు.

ఓపీలో ఒక్కరే..

హైదరాబాద్ జిల్లాలో ఉన్న ఖైరతాబాద్ వెల్‌నెస్ సెంటర్ సమస్యల నిలయంగా మారింది. గత ప్రభుత్వంలో ఓపీల తాకిడితో కిటకిటలాడేది. ప్రస్తుతం అనుకున్న స్థాయిలో జనాలు రాకపోవడంతో ఓపీ రోగుల సంఖ్య తగ్గడం గమనార్హం. వచ్చిన వారికి సైతం సకాలంలో వైద్యం అందించేందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు. పొరుగు సేవల ప్రాతిపదికన నియామకమైన వైద్య సిబ్బందిలో చాలా మంది రిటైర్డ్ వైద్యులున్నారు. వారంతా ఒక పక్క అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మరో పక్క పేషెంట్లకు సేవలందిస్తున్నారు. గతంలో ఓపీ సేవల్లో జనరల్ ఫిజీషియన్లు ముగ్గురు ఉండేవారు. సోమవారం ఒక్కరు మాత్రమే ఓపీలో సేవలందించడం వల్ల రోగులు గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. రోగికి రాసిన మందుల్లో సగం మాత్రమే ఆసుపత్రిలోని ఫార్మసిలో లభించగా, మిగతావి వారంరోజుల్లోగా వస్తాయంటూ సిబ్బంది నిర్లక్ష్యపు సమాధానం ఇవ్వడం గమనార్హం. దీర్ఘకాలపు జబ్బులకు మందులు లేకపోవడంతో ప్రైవేట్ ఫార్మసీల్లో డబ్బులు పెట్టి కొనుక్కునే పరిస్థితి నెలకొనడంతో వైద్యంకోసం వచ్చేవారంతా ఇబ్బంది పడుతున్నారు.

నిర్లక్ష్యపు సమాధానం

వెల్‌నెస్ కేంద్రంలోని పలువురు కిందిస్థాయి ఉద్యోగులు రోగుల పట్ల నిర్లక్ష్యపు వైఖరితో ఉన్నారు. వైద్యం చేయించుకునే సందర్భంలో సందేహాలు అడిగినా, మిగతా మందులు ఎప్పుడొస్తాయని అడిగినా సరైన సమాధానం ఇవ్వకుండా వ్యవహరిస్తున్నారు. సిబ్బంది వైఖరితో రోగులు అసహనంతో ఉన్నారు.

1000 చోట్లకు గానూ 121 ప్రాంతాల్లో ఏర్పాటు

సిటీ రోడ్లపై మళ్లీ చెత్త డబ్బాలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్ ప్రభుత్వంలో హైదరాబాద్‌లోని రోడ్లపై ఎక్కడా గార్బేజ్‌బిన్లు లేకుండా చూస్తే ఈ ప్రభుత్వం చెత్త డబ్బాలను తిరిగి ఏర్పా టు చేయాలని భావిస్తున్నది. చెత్త రహిత నగరమే లక్ష్యమని జీహెచ్ఎంసీ చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం ఇందుకు విరుద్ధంగా ఎక్కడ చూసినా పేరుకుపోయిన చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. ప్రధాన రోడ్ల నుంచి గల్లీ రోడ్ల దాకా చెత్త పేరుకుపోతున్న ది. ప్రధానంగా జీవీపీ (తరచూ చెత్త వేసే ప్రాంతాలు) పాయింట్ల ఎత్తివేతలో జీహెచ్ఎంసీ విఫలం చెందింది. ఈ నేపథ్యంలోనే గ్రేటర్ రోడ్లపై డంపర్ బిన్లు (చెత్త డబ్బాలు) ఏర్పాటు చేస్తున్నారు. ఖైరతాబాద్, కూకట్‌పల్లి, ఎల్బీనగర్, చార్మినార్, శేరిలింగంపల్లి, సికింద్రాబాద్ జోన్లకు గానూ 1000 డంపర్ బిన్లను కొనుగోలు చేశారు.

ఈ నేపథ్యంలోనే చార్మినార్‌లో 115, ఖైరతాబాద్ జోన్‌లో ఆ రు ప్రాంతాల్లో డంపర్ బిన్లు (స్మార్ట్ బిన్లు)ను ఏర్పాటు చేశారు. కాగా స్వచ్ఛ హైదరాబాద్ లో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో చెత్త లేకుండా చేసేందుకు డస్ట్ బిన్ ఫ్రీసిటీగా మా ర్చాలని కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించి బహిరంగ ప్రదేశాల్లో చెత్త డబ్బాలను ఎత్తివేసింది. బహిరంగ ప్రదేశాలు, రోడ్ల వెంబడి చెత్త డబ్బాలను దాదాపు 800 చోట్లకుపైగా తగ్గించే కార్యక్రమాలను పక్కాగా అమలు చేసింది.

పెరిగిన జనాభా, కాలనీల్లో చెత్త ఉత్పత్తి పెరిగినప్పటికీ అందుకు అనుగుణంగా తరలించే స్వచ్ఛ ఆటోలు, వాహనాలను పెంచింది. వీధి వ్యాపారులు (స్ట్రీట్ వెండర్స్) తప్పనిసరిగా డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వంలో మళ్లీ గ్రేటర్ రోడ్లపై డంపర్‌బిన్లు తెరపైకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు.